నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, గురువారం 11 ఏప్రిల్ 2024 | NIZAMABAD

నిజామాబాద్‌లో ఈద్గా వద్ద ఏర్పాటు చేసిన టెంట్లు

దర్శనమిచ్చిన నెలవంక

- ముగిసిన రంజాన్ ఉపవాస దీక్షలు
- నేడు ఈద్-ఉల్-ఫితర్
- ప్రత్యేక ప్రార్థనలకు ఈద్గాల వద్ద ఏర్పాట్లు

కామారెడ్డి/సుభాష్‌నగర్, ఏప్రిల్ 10: నెలవంక మెరిసింది. రంజాన్ పండుగ వచ్చేసింది. పుణ్యఫలాల పవిత్ర రంజాన్ మాసం ఉపవాస దీక్షలు షవ్వాల్ మాసం నెలవంక కనిపించడంతో ముగిశాయి. నెల రోజులపాటు కఠోర ఉపవాసం చేసిన ముస్లింలు బుధవారం సాయంత్రం దీక్షలు విరమించి గురువారం ఈద్-ఉల్-ఫితర్ జరుపుకొనేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలోని మసీదులు, ఈద్గాలను ముస్లిముల సామూహిక ప్రార్థనల కోసం ముస్తాబు చేశారు.

కామారెడ్డిలో ప్రత్యేక ప్రార్థనల కోసం వేసిన టెంట్లు

సామూహిక ప్రార్థనలకు ఏర్పాట్లు..

రంజాన్ సందర్భంగా సామూహిక ప్రార్థనలకు మసీదులు, ఈద్గాల వద్ద మున్సిపల్ అధికారులు ఏర్పాట్లు చేశారు. నిజామాబాద్ నగరంలోని గాంధీచౌక్ సమీపంలో ఉన్న కచియా మసీదులో ఉదయం 8 గంటల నుంచి, ఖిల్లా ప్రాంగణంలోని జామా మసీదులో 8.30 నుంచి సామూహిక ప్రార్థనలు ప్రారంభించనున్నట్లు ముస్లిం మతపెద్దలు వెల్లడించారు. కామారెడ్డి పట్టణంలోని కోర్టు వద్ద ఉన్న దర్గా వద్ద మున్సిపల్ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు.



ఐపీఎల్ హోరు.. బెట్టింగ్ జోరు

- ఒక్కో బాల్‌కు ఒక్కో రేట్
- లక్షలు పెట్టి మోసపోతున్న యువత
- ఆన్‌లైన్‌లో చేతులు మారుతున్న కోట్లు
- నియంత్రించడంలో విఫలమవుతున్న పోలీసులు

ఓ వైపు ఎన్నికల వేడి కొనసాగుతుండగానే మరోవైపు ఐపీఎల్ టోర్నీ ప్రారంభమైంది. ఎక్కడ చూసినా క్రికెట్ అభిమానులు టీవీలకు అతుక్కుపోతున్నారు. నగరాలు, పట్టణాలు, పల్లెటూళ్లలోనూ క్రికెట్ ఫీవర్‌తో ఊగిపోతున్నారు. మరోవైపు ఐపీఎల్ పేరిట బెట్టింగ్ జోరందుకున్నది. చాపకింద నీరులా వ్యాపిస్తున్నది. ప్రధానంగా యువకులు బెట్టింగ్‌కు బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. కొంతమంది తక్కువ టైంలో ఎక్కువ మనీ సంపాదించ వచ్చనే అత్యాశతో సర్వం కోల్పోతున్నారు. క్రికెట్ ప్రేమికుల వ్యసనాన్ని, బలహీనతలను ఆసరాగా చేసుకొని బెట్టింగ్ ముఠాలు తమ బుట్టలో వేసుకుంటున్నాయి. ఉమ్మడి జిల్లాలో రంగంలోకి దిగిన పలు ముఠాలు ప్రత్యేక గ్రూపులను ఏర్పాటు చేసి బెట్టింగ్ నడిపిస్తున్నట్లు తెలిసింది.

–వినాయక్‌నగర్, ఏప్రిల్ 10

ఆన్‌లైన్‌లోనే చెల్లింపులు..

అందుబాటులోకి వచ్చిన టెక్నాలజీని సైతం బెట్టింగ్‌రాయుళ్లు ఉపయోగిస్తున్నారు. క్రికెట్ బెట్టింగ్ నిర్వహించే బుకీలు లావాదేవీలు మొత్తం ఆన్‌లైన్ ద్వారానే జరుపుతున్నారు. దీంతో బెట్టింగ్ ఆడే యువకులు సైతం ముందస్తుగానే ఫోన్ పే, గూగుల్ పే తదితర ఆన్‌లైన్ మార్గంలోనే డబ్బులు చెల్లిస్తున్నారు. దీంతో క్రికెట్ జూదంపై ఎవరికీ అనుమానం రాకుండా మూడు ఫోర్లు.. ఆరు సిక్సర్లలా సాగుతున్నది.

చాపకింద నీరులా.. బెట్టింగ్ బుకీలు

క్రికెట్ బెట్టింగ్‌లో ప్రధాన బుకీలు తమకు అనువుగా ఉండే వారిని ఏజెంట్లుగా పెట్టుకొని వారిని జిల్లాలోని అన్ని మండలాలకు పంపుతున్నారు. స్థానిక యువతకు దగ్గరగా ఉంటూ వారి ద్వారా తమ బెట్టింగ్ జూదాన్ని జోరుగా సాగిస్తున్నారు.ప్రస్తుతం డబ్బుల చెల్లింపు మొత్తం ఆన్‌లైన్ ద్వారానే సాగుతుండడంతో యువత ఈజీగా బెట్టింగ్‌లో సభ్యులుగా చేరిపోతున్నారు.

బానిసగా మారుతున్న యువత..

క్రికెట్ బెట్టింగ్‌లో రూపాయికి వంద రూపాయలు వస్తాయని తెలియడంతో నిత్యం వందలాది మంది యువత లక్షల్లో బెట్టింగ్ కడుతున్నారు. తెలంగాణతోపాటు మహారాష్ట్ర ఏరియాలకు చెందిన ప్రధాన బుకీలు తమకు ఉన్న ఏజెంట్స్ ద్వారా బెట్టింగ్ దందా జోరుగా సాగిస్తున్నారు. ఒక్కో మ్యాచ్ ముగిసేసరికి రూ.కోట్లు సంపాదిస్తున్నారు. జోష్‌లో ఉన్న యువత బెట్టింగ్‌లో డబ్బులు పెడుతూ లక్షల్లో నష్టపోతున్నారు. డబ్బులు రావడం దేవుడెరుగు చాలా మంది యువత అప్పులపాలవుతూ ఇంట్లో చెప్పుకోలేక మదన పడుతున్నారు.

బెట్టింగ్‌కు అడ్డాలివే..?

లాడ్జీలు, గెస్ట్‌హౌస్‌లు, దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లు, అపార్ట్‌మెంట్లలోని ఫ్లాట్లు క్రికెట్ బెట్టింగ్‌కు అడ్డాగా మారాయి. యువతను ఆకర్షించేలా వ్యాపార సముదాయాల్లో పెద్ద స్క్రీన్లను ఏర్పాటు చేస్తున్నారు. దీనిని అదనుగా చేసుకొని బెట్టింగ్‌రాయుళ్లు అక్కడే తిష్టవేసి క్రికెట్ జూదం నడుపుతున్నారు.

పోలీసుల 'నిఘా' ఏమైంది..

గతంలో ఐపీఎల్ మ్యాచ్‌లు ప్రారంభం కాగానే బెట్టింగ్ ఆడేవారిపై పోలీసులు నిఘా పెట్టేవారు. ఐడీ పార్టీ, టాస్క్‌ఫోర్స్, స్పెషల్ బ్రాంచ్, టౌన్ ఐడీ పార్టీ టీమ్స్ పేరిట ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగేవారు. విశ్వసనీయ సమాచారం మేరకు క్రికెట్ బెట్టింగ్ ఏజెంట్స్‌తో పాటు బెట్టింగ్‌రాయుళ్ల పై నిఘా పెట్టి దాడులు చేసేవారు. నిర్వాహకుల నుంచి లక్షల నగదుతోపాటు సెల్‌ఫోన్స్ సీజ్ చేసి కేసులు నమోదు చేసేవారు. ప్రస్తుతం ఐపీఎల్ మ్యాచ్‌లు జరుగుతున్నప్పటికీ ఇప్పటి వరకు పోలీసులు బెట్టింగ్ బుకీలు, ఏజెంట్లు, బెట్టింగ్ రాయుళ్లను పట్టుకున్నదాఖలాలు లేవు. బెట్టింగ్ జరిగే విషయం పోలీసులకు తెలియడం లేదా లేక తెలిసినా తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారా అనే బహిరంగ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాజకీయ నాయకులు, పోలీసుల్లో కొందరి అండ ఉండడంతో బుకీలు మూడు సిక్సర్లు, నాలుగు వికెట్ల చందంగా వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరిస్తూ రెచ్చిపోతున్నారు. ఈ సీజన్‌లో నాలుగు రాళ్లు వెనకేసుకునేందుకు బుకీలు తమ కార్యకలాపాల జోరు పెంచారు.

ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

- కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు
- ఓటు వేసే విధానంపై ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలి
- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జితేశ్ వీ పాటిల్

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కామారెడ్డి, ఏప్రిల్ 10 : ప్రశాంత వాతావరణంలో పార్లమెంట్ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు నోడల్ అధికారులు, ఎన్నికల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కామారెడ్డి కలెక్టర్, ఎన్నికల అధికారి జితేశ్ వీ పాటిల్ అన్నారు. కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు చంద్రమోహన్, శ్రీనివాస్ రెడ్డి, అదనపు ఎస్పీ నరసింహారెడ్డితో కలిసి బుధవారం నోడల్ అధికారులతో ఎన్నికల ప్రవర్తనా నియమావళి, అనుమతులు, ఫిర్యాదులపై స్పందించడం, అక్రమంగా డబ్బు, మద్యం తరలించడం, కానుకలను స్వాధీనం చేసుకోవడం, పోస్టల్ బ్యాలెట్, ఈవీఎంల తరలింపు తదితర అంశాలపై సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అభ్యర్థి చేసే ప్రతి ఖర్చుకు సం బంధించి లెక్కలు చూపాల్సి ఉంటుందని అన్నారు. కోడ్ ఉల్లంఘన, డబ్బు, మద్యం అక్రమంగా తరలిస్తే కేసులు నమోదు చేసి రోజూవారి నివేదికలు సమర్పించాలని సూచించారు. కరపత్రాలు, ఫ్లెక్సీలు వంటివి ముద్రించే విషయంలో సెక్షన్ 127 ఏ సూచనలు పాటించాలన్నారు. బ్యాలెట్ యూనిట్ ద్వారా ఓటు వేసే విధానంపై పట్టణ ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించిన ప్రక్రియ సోమవారం నాటికి పూర్తి చేయాలన్నారు. ఎన్నికల విధులు కేటాయించిన వారికి ఎలాంటి మినహాయింపు లేదని, హాజరు కాని వారికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని చెప్పారు. నోడల్ అధికారులు వరదారెడ్డి, శ్రీనివాస్, అంబాజీ, శ్రీనివాస్ రెడ్డి, రాజారామ్, ఏవో మసూర్ అహ్మద్, ఎన్నికల పర్యవేక్షకులు ప్రేమ్ కుమార్, ఇందిరా ప్రియదర్శిని, జ్యోతి, స్వప్న, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనిల్‌కుమార్ గాలికి బీజేపీ, కాంగ్రెస్ కొట్టుకుపోవాలి

- బీఆర్ఎస్ సైనికులు కష్టపడి పనిచేయాలి
- జహీరాబాద్ స్థానంపై గులాబీ జెండా ఎగురవేయాలి
- మాజీ స్పీకర్ పోచారం

సదాశివనగర్ మండలంలో మాట్లాడుతున్న మాజీ స్పీకర్ పోచారం. వేదికపై గాలి అనిల్‌కుమార్, జాజాల

దోమకొండ/సదాశివనగర్/పిట్లం, ఏప్రిల్ 10 : లోక్‌సభ ఎన్నికల్లో అనిల్ కుమార్ గాలికి బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు కొట్టుకుపోవాలని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి అన్నారు. జహీరాబాద్ లోక్‌సభ స్థానంపై గులాబీ జెండాను ఎగురవేసేందుకు బీఆర్ఎస్ సైనికులంతా కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. దోమకొండ, బీబీపేట్ మండలాల కార్యకర్తల సమావేశాన్ని దోమకొండలో, సదాశివనగర్, రామారెడ్డి కార్యకర్తల సమావేశాన్ని మర్కల్‌లో, పిట్లం, పెద్ద కొడప్‌గల్ కార్యకర్తల సమావేశాన్ని పిట్లంలో బుధవారం వేర్వేరుగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆరు గ్యారెంటీలను అమలు చేయలేదన్నారు. కల్యాణలక్ష్మితోపాటు తులం బంగారం ఇస్తామని ఇవ్వలేదన్నారు. ఆడబిడ్డలకు నెలకు రూ.2500 ఇస్తామని చెప్పి ఇవ్వలేదన్నారు. నిరుద్యోగులకు ప్రతినెలా రూ. 4 వేల జీవనభృతిని అందిస్తామన్న భట్టి విక్రమార్క.. ఇక తన వట్టి మాటలను కట్టిపెట్టాలని హితవు పలికారు. బీజేపీ రామనామంతో ఓట్లను దండుకోవడమే తప్ప అధికారంలోకి వచ్చి పదేండ్లు గడిచినా రాష్ట్రానికి ఇచ్చిందేమీ లేదన్నారు. పదేండ్లుగా ఎంపీగా ఉండి పది పైసల పనిచేయని వ్యక్తిగా బీబీ పాటిల్ నిలిచారని, ఎంపీగా ఉండి ఏ ఒక్క గ్రామంలో కూడా తిరగని వ్యక్తి పాటిల్ అని విమర్శించారు. పనికిరాని మొక్కలను తీసి గోదాట్లో పడేయాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయని పథకాలపై గ్రామగ్రామాన, గల్లీగల్లీలో మీటింగులు పెట్టి ప్రజలకు అర్థమయ్యేలా వాస్తవాలు చెప్పాలన్నారు.

దోమకొండలో మాట్లాడుతున్న గంప గోవర్ధన్

దోమకొండలో ప్రభుత్వ మాజీ విప్ గంప గోవర్ధన్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో ఏ రాష్ట్రంలో జరగని విధంగా తెలంగాణలో అభివృద్ధి జరిగిందన్నారు. రాష్ట్రాన్ని నంబర్‌వన్ స్థానంలో నిలిపిన నాయకుడు కేసీఆర్ అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

పిట్లంలో మాట్లాడుతున్న హన్మంత్ షిండే

పిట్లంలో జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన తప్పిదాలను సరిదిద్దుకొని గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ జహీరాబాద్ లోక్‌సభ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. పార్టీ అధినేత కేసీఆర్ తనను ఆశీర్వదించి పంపించారని అన్నారు. ప్రజలు కూడా ఓటుతో ఆశీర్వదిస్తే ఎల్లవేళలా అండగా ఉంటానన్నారు. బాన్సువాడ, పిట్లం మీదుగా రైల్వేలైన్ ఏర్పాటుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఆయా సమావేశాల్లో పార్టీ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్, ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, జడ్పీ మాజీ చైర్మన్ దఫేదర్‌రాజు, జడ్పీ వైస్ చైర్మన్ పరికి ప్రేమ్‌కుమార్, రాష్ట్ర నాయకుడు గంప శశాంక్, ఆయా మండలాల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

1726 ఎకరాల్లో పంట నష్టం

వడగండ్ల వానతో 910 మంది రైతులకు దెబ్బ

ఖిల్లీవాడి, ఏప్రిల్ 10 : నిజామాబాద్ జిల్లాలోని బాన్సువాడ, బోధన్ డివిజన్లలో రెండు రోజుల క్రితం కురిసిన వడగండ్ల వాన రైతులకు కడగండ్లు మిగిల్చింది. మొత్తం 1726.12 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. 910 మంది రైతులు నష్టపోగా, అత్యధికంగా వరి పంట దెబ్బతిన్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజిద్ హుస్సేన్ తెలిపారు. వర్ని మండలంలో 61 ఎకరాలు, మోస్రాలో 94, చందూర్‌లో 240, రుద్రూర్‌లో 5, కోటగిరిలో 34, పొతంగల్‌లో 176, బోధన్‌లో 68, సాలూరా మండలంలో183 ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నట్లు వెల్లడించారు. దీంతోపాటు మామిడి, బొప్పాయి, మునగ, సొరకాయ, జొన్న పంటలకు నష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు.

దోమలెడ్గిలో వరి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్

కాంగ్రెస్, బీజేపీ ఒక్కటే..

- ఎంపీ ఎన్నికల తర్వాత రేవంత్‌రెడ్డి బీజేపీలోకి వెళ్లడం ఖాయం
- మైనార్టీల సంక్షేమానికి కృషి చేసింది కేసీఆరే..
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

ఇఫ్తార్ విందులో ముస్లిములకు పండ్లు తినిపిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

ముప్కాల్ (మెండోరా), ఏప్రిల్ 10: కాంగ్రెస్, బీజేపీలు ఒక్కటేనని, రెండు పార్టీలు కుమ్మక్కు రాజకీయాలకు పాల్పడుతున్నాయని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. మెండోరా మండలం పోచంపాడ్ గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్లమెంటు ఎన్నికలు ముగిసిన అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీలోకి వెళ్తారన్నారు. మైనార్టీల అభ్యున్నతికి కేసీఆర్ హయాంలో కృషి చేశామన్నారు. మైనార్టీ రెసిడెన్షియల్స్‌ను ఏర్పాటు చేసి ముస్లిముల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించినట్లు గుర్తుచేశారు. కులమతాలకు అతీతంగా బీఆర్ఎస్ పాలన చేపట్టిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అభివృద్ధి పనులకు ముమ్ముందు కూడా తనవంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు. అనంతరం ముస్లిములకు పండ్లు తినిపించిన వేముల.. రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ నాగంపేట్ శేఖర్ రెడ్డి, జడ్పీటీసీ గంగాధర్, ఎంపీపీ బురుకల సుకన్యాకమలాకర్, తాజా మాజీ సర్పంచ్ మిస్బావొద్దీన్, బీఆర్ఎస్ టౌన్ ప్రెసిడెంట్ రాజు, రామాలయ మాజీ చైర్మన్ అనిల్, ముస్లిములు పాల్గొన్నారు.